క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



ఆస్పరిలో పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు

ఆస్పరి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడి పూజను మాలధారులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అయ్యప్పస్వామికి గురుస్వాములు రమేష్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో గంగ పూజ, గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి హోమం, భజన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు.

నేడు గరుడసేవ



విద్యుద్దీపాలతో వెలుగులీనుతున్న రంగనాథస్వామి కోవెల

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు గరుడ వాహన సేవ, పల్లకోత్సవం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి వీరయ్య ఆదివారం తెలిపారు. సాయంత్రం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం అనంతరం ప్రభోత్సవం చేపడతామని చెప్పారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం సందర్భంగా మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.


సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



చిట్యాలలో సీసీ రహదారిని పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శేషయ్య

కృష్ణగిరి: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సీసీ రహదారుల్లో నాణ్యత తప్పక పాటించాలని పంచాయతీరాజ్ డీఈ శేషయ్య అన్నారు. మండలంలోని చిట్యాల, కోయిలకొండ, అమకతాడు, కర్లకుంట, పెనుమాడ, బోయబొంతిరాళ్ల తదితర గ్రామాల్లో పల్లె పండుగ కింద ఏర్పాటు చేసిన సీసీ రహదారులను ఆదివారం ఆయన ఏఈ జాకీర్ హుసేన్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యతతోపాటు క్యూరింగ్ నిబంధనల ప్రకారం చేయాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



చెరువు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆలూరు రూరల్: పట్టణ సమీపంలోని చెరువును ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమంతు, ఆలూరు ప్రాంతీయ కమిటీ నాయకులు కృష్ణ, మైన,ఈరన్న డిమాండ్ చేశారు. ఆదివారం కబ్జాకు గురైన ఆలూరు చెరువును పరిశీలించారు. వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 748లో 150 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. గత పదేళ్లగా చెరువు నిండకపోవడంతో కబ్జాదారుల కన్నుపడిందన్నారు. చెరువులో మూడు రోజుల క్రితం అధికార పార్టీ నాయకులు రాళ్లపాతి కబ్జాకు పాల్పడ్డారన్నారు. ఇప్పటికే దేవాలయాలు, ఇళ్లు వెలిశాయన్నారు. దీన్ని అదునుగా చేసుకున్న కూటమి నాయకులు యథేచ్ఛగా సరిహద్దు రాళ్లు పాతేశారన్నారు. గతంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు ఆలూరు చెరువును సర్వే చేసి సరిహద్దు కంచే వేస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురవుతోందన్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు.



ఆలూరు నుంచి పెద్దహోతూరు వరకు ప్యాచ్ వర్కు పనులు చేసినప్పటికీ కంకర లేచిపోయి ఇలా..



ఆలూరు నుంచి కురుకుంద గ్రామం వరకు ప్యాచ్ వర్కు పనిచేసిన రోడ్డు గుంతలు పడిన దృశ్యం



పత్తికొండ నుంచి దేవనకొండ వరకు చేసిన ప్యాచ్ వర్కు ఇలా..

పూత పూసి..
నిధులు మేసి!


- రోడ్లపై గుంతలు పూడ్చేందుకు లక్షలాది రూపాయల వెచ్చింపు
- ప్యాచ్ వర్క్‌ల పేరుతో కంకర చల్లి, తారు పూసి సరిపెడుతున్న వైనం
- కొద్ది రోజులకే గుంతలు ప్రత్యక్షం
- ఆశ్చర్యపోతున్న ప్రయాణికులు, వాహనదారులు

ఆలూరు: రోడ్లు గుంతలు పడి ప్రయాణానికి పనికి రాని విధంగా మారాయని, ప్రమాదాలబారిన పడుతున్నామని ప్రయాణికులు నిలదీస్తుండటంతో కూటమి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని, గుంతలు పూడ్చే పనుల పేరుతో తమ వారికే లక్షలాది రూపాయలతో ప్యాచ్ పనులను కేటాయించింది. ఇదే అదనుగా భావించిన కాంట్రాక్టర్ తమ్ముళ్లు గుంతలపై కంకర చల్లి, తారు పూత పూసి పనులు 'పూర్తి' చేశారు. అయితే పనులు చేసి రోజులు గడవక ముందే గుంతలు మళ్లీ ప్రత్యక్షమవుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. రోజుల వ్యవధిలోనే ప్యాచ్ వర్క్‌లు తేలిపోతుండటం, కంకర రోడ్డుపైకి వచ్చి కొత్తగా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అయితే కేవలం తారు పూసి నిధులు మింగేశారని ఆరోపణలున్నాయి.

- ఆదోని -బళ్లారి రోడ్డు నుంచి పెద్దహోతూరు (వయా) మరకట్టు గ్రామ రోడ్డు 0/0 -3/425 .3.43 కి.మీ. రూ.4.50 లక్షలు
- ఆలూరు-ఆస్పరి రోడ్డు (వయా) మొలగవెల్లి గ్రామ రోడ్డు 0/0-11/0 11 కి.మీ. రూ.15 లక్షలు కేటాయించినా పనులు చేయలేదు.
- హెబ్బటం నుంచి ముద్దనగేరి రోడ్డు 0/0-2/0,కి.మీ, 5/0-8/0 మరియు 10/0,11/0 6 కి.మీ రూ.4.90 లక్షలు
- హాలహర్వి మండల కేంద్రం నుంచి గూళ్యం గ్రామ రోడ్డు 0/0-6/8 6.80 కి.మీ., రూ.10 లక్షలు
- హెబ్బటం నుంచి ఇంగదహాల్ 3/4-6/2 3 కి.మీ., రూ.3 లక్షలు
- ఆలూరు -ఆస్పరి (వయా) మొలగవెల్లి గ్రామ రోడ్డు 15/02-20/0 5 కి.మీ రూ.10 లక్షలు
- తుగ్గలి మండల కేంద్రం నుంచి నంచర్ల గ్రామ రోడ్డు 0/0-7/0 7 కి.మీ రూ.7 లక్షలు
- మద్దికెర నుంచి పత్తికొండ మీదుగా దేవనకొండ గ్రామం వరకు 10/8-20/6 9 కి.మీ రూ.25 లక్షలతో ప్యాచింగ్ పనులు చేశారు. కర్నూల్ జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి, ఎస్ఐ మారుతి, సిబ్బంది వెలమకూరు గ్రామ సమీపంలో గుంతలను తప్పించబోయి జీపు బోల్తా పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. అయినా సంబంధిత అధికారులు నేటికీ అక్కడ ప్యాచింగ్ పనులు చేయలేదు.



వెలమకూరు సమీపంలో ప్యాచింగ్ పనులు సరిగా చేయకపోవడంతో గతేడాది నవంబర్ 27న కర్నూల్ ఎక్సైజ్ సీఐ సుభాషిణి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురై ఆమెతో పాటు మరో ఐదుగురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు



హెబ్బటం నుంచి ఇంగదహాళ్ వరకు ప్యాచింగ్ పనులు చేసినా కంకర తేలిన దృశ్యం

అపరిచిత వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించొద్దు

హాలహర్వి: అపరిచిత వ్యక్తులు పంపే మెసేజ్‌లకు ప్రజలు స్పందించొద్దని ఎస్ఐ చంద్ర సూచించారు. ఆదివారం హాలహర్విలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల సంక్రాంతి పండగ ఆఫర్ అంటూ కొందరు అపరిచిత వ్యక్తులు మెసేజ్‌లు పంపి ఖాతాల్లోని నగదును స్వాహా చేసేందుకు ఎత్తుగడ వేస్తున్నారన్నారు. అలాంటి మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించరాదని, ఎవరికీ బ్యాంకు ఖాతా వివరాలను షేర్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

19న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

ఆలూరు: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఈనెల 19వ తేదీన పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె.మల్లికార్జున తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బి.విరూపాక్షి, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు శశికళ,దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు హాజరవుతారని చెప్పారు.

నేడు టమాట విక్రయాలు బంద్

పత్తికొండ(తుగ్గలి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని సోమవారం పత్తికొండ మార్కెట్‌యార్డులో టమాట విక్రయాలు నిలిపివేసినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి కార్నోలిస్ ఆదివారం తెలిపారు. పశువుల సంత యధావిధిగా జరుగుతుందని, కేవలం టమాట విక్రయాలు మాత్రమే జరగవన్నారు. టమాట రైతులు గమనించాలని కోరారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోండి



పంచాయతీ కార్యాలయ ఆవరణలో వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



నిట్రవట్టిలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

దేవనకొండ: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువరు వక్తలు పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం స్వామివివేకానంద జయంతి నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవిత విశేషాలు అందరికీ ఆదర్శమని, మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ యవనికపై చాటారన్నారు. విశ్రాంత హెచ్ఎం ఉచీరప్ప, బి.రామాంజనేయులు, మాజీ సైనికులు వినయ్ పవార్, శ్రీనివాసులుయాదవ్, మల్లికార్జున రెడ్డి, భీమేష్, గోవిందు పాల్గొన్నారు.

హాలహర్వి: స్వామి వివేకానందుడు ఆదర్శప్రాయుడని సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయుడు అయ్యన్నగౌడ్, కేర్ టేకర్ జమదగ్ని అన్నారు. ఆదివారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌లో స్వామి వివేకానందుడి జయంతిని నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే.. పచ్చారపల్లి, సిద్ధాపురం, బిలేహాల్ గ్రామాల్లో వివేకానంద జయంతి నిర్వహించారు.



పత్తికొండలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

పత్తికొండ(తుగ్గలి) : దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద జయంతిని ఆదివారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, న్యాయవాదులు మల్లికార్జున, నరసింహయ్య, నాగలక్ష్మయ్య, సుధాకృష్ణ, రాజశేఖరనాయుడు, వాసు మునెయ్య, అబ్దుల్ రాజ్ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ నాయకులు గోవర్ధన్ మల్లికార్జున తదితరులు స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.



వేదికపై గురువులు, పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

కృష్ణగిరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-11 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతిలో 14 ఏళ్ల క్రితం వీడ్కోలు చెప్పుకున్న వారందరూ కలుసుకుని కుశల ప్రశ్నలు వేసుకుంటూ, నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులు శారదమ్మ, అమీర్‌బాషా, నాయుడు, నాజర్అలీ, నవాజ్, కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఏసు, ఉసేన్, కాలుమియ్యా తదితరుల పాల్గొన్నారు.

బియ్యం మాత్రమే ఇస్తే ఎలా?

హాలహర్వి: రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తే ఎలా అని కార్డుదారులు ప్రశ్నించారు. మండలంలోని మాచనూరు గ్రామంలోని రేషన్ దుకాణంలో కేవలం బియ్యం మాత్రమే వేస్తున్నారని, కందిబేడలు, చక్కెర ఇవ్వమంటే రేపు ఇస్తాం, ఎల్లుండి ఇస్తామని చెబుతున్నారని సుంకన్న అనే కార్డుదారుడు మండిపడ్డారు. పండగ పూట బియ్యంతో సర్దిపెట్టుకోవాలా ప్రశ్నించారు. ఇప్పటికైనా కందిబేడలు, చక్కెర ఇవ్వాలని రేషన్ డీలర్‌ను కోరారు.



మాచనూరులో రేషన్ డీలర్‌ను ప్రశ్నిస్తున్న కార్డుదారులు

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ

పత్తికొండ(తుగ్గలి) : భారతీయ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని యువ స్పందన 9వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. లిఖిత, అంజలి, సురేఖ విజేతలుగా నిలవగా వారికి రూ.5,016, రూ.3,016, రూ.2,016 నగదును అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయిని కల్యాణి, సొసైటీ సభ్యులు సురేంద్ర, లక్ష్మన్న, నాగరాజు, రంగస్వామి, మక్బుమ్, చిన్న, జయవీర్, అమరేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

ఆస్పరి: ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరుపాక్షి అన్నారు. వైఎస్సార్‌సీపీ మండలం అధ్యక్షుడిగా బసవరాజును నియమించిన సందర్భంగా ఆదివారం మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సమక్షంలో నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంటీసీలు బసవరాజును ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ వారికి పార్టీ సముచితంగా గౌరవిస్తుందని చెప్పారు. కష్టపడి పని చేసిన వారిని గుర్తిస్తాడనడానికి తానే నిదర్శనన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడ నెరవేర్చలేదన్నారు. సర్పంచులు హరికృష్ణ, పెద్ద రెడ్డి, నాయకులు గోవర్ధన, వెంకన్న, శివానంద, బొబ్బిలి మనోహర్‌రెడ్డి, ఆశోక్, సుంకన్న, లక్ష్మన్న, శివ, చిన్నాయప్ప, ప్రకాష్, వేణుగోపాల్, హనుమంతరెడ్డి, నాగరాజు, నాయుడు, ఉశేని, దస్తగిరి, అంజినయ్య పాల్గొన్నారు.

తిరుపతి ఘటన బాధాకరం

ఆలూరు రూరల్: వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం వచ్చిన భక్తుల్లో ఆరుగురు తొక్కిసలాటలో మృతి చెందడం బాధాకరమని, మృతుల కుంటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే విరూపాక్షి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి దేవస్థానం చరిత్రలో తొలిసారి విషాధ ఘటన చోటు చేసుకుందన్నారు. టీడీడీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

తమదంతా ఒకే కుటుంబం..

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా తన కుటుంబ సభ్యులేనని, తమదంతా ఒకే కుటుంబమని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కొత్తపేట సర్పంచ్ బాబు కుమార్తె వివాహ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, దౌర్జన్యాలకు దిగితే ఊరుకునే ప్రసక్తేలేదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జెడ్పీటీసీ, మండల కన్వీనర్ రామకృష్ణ (కిట్టు), కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు దివాకర్‌నాయుడు, ఉమాంబ, పాలకుర్తి హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి, అంపిరెడ్డి, మోహన్‌రెడ్డి, తెర్నేకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

తీగలను తాకుతున్న కంపచెట్లు..



విద్యుత్ తీగలు కనిపించనంతగా పెరిగిన కంప చెట్లు

హాలహర్వి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎస్సీ కాలనీ వద్ద విద్యుత్ తీగలను ముళ్ల కంపలు తాకుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ముళ్ల కంపలను తొలగించాలని ఫిర్యాదు చేసినా కాలయాపన చేస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. గాలులు వీచినప్పుడు నిప్పులు రాలుతున్నాయని చెబుతున్నారు. ఏదేని ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుంత.. ప్రమాదం చెంత!

తుగ్గలి : పత్తికొండ నుంచి ఎద్దులదొడ్డి వెళ్లే దారిలో కల్వర్టు కుంగిపోయింది. అలాగే.. తుగ్గలి రైల్వే స్టేషన్ రోడ్డులోని అండర్‌పాస్ రోడ్డు మధ్యలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ దారుల్లో ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



తుగ్గలి రైల్వేస్టేషన్ రోడ్డు అండర్ పాస్‌లో సీసీ రోడ్డులో పడిన గుంత



పత్తికొండ నుంచి ఎద్దులదొడ్డికి వెళ్లే దారిలో కుంగిన కల్వర్టు





వ్యవసాయ పనిముట్ల తయారీలో కొలిమి తిప్పుతున్న, సమ్మెట వేస్తున్న మహిళలు, సమ్మెట వేస్తున్న బాలుడు

కొలిమి తిప్పి..సమ్మెట వేసి..

- వ్యవసాయ సామగ్రి తయారు చేసి విక్రయిస్తున్న వలస జీవులు
- మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రాక
- వంటింటి వస్తువులూ తయారీ
- రోడ్డు పక్కనే జీవనం



తయారు చేసిన వస్తువులను విక్రయిస్తూ



తయారు చేసిన కొడవళ్లు, గొడ్డళ్లు, కత్తిపీటలు

పత్తికొండ(తుగ్గలి) : ఆడవారు వంటింటికే పరిమితి అన్నది ఒకప్పటి మాట. ఇప్పుడు తాము ఎందులోనూ తీసిపోమని మహిళలు నిరూపించుకుంటున్నారు. బతుకు బండి లాగేందుకు కొందరు దూర ప్రాంతాలకు వెళ్తుంటారు. పనిచేస్తూ కుంటుబానికి అండగా నిలుస్తుంటారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి కొందరు పిల్లాపాపలతో పత్తికొండకు వలసొచ్చారు. వీరు ప్రధాన రహదారుల వెంబడి చిన్నచిన్న గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. మహిళలు కొలిమి పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నారు. వ్యవసాయ, వంటిట్లో ఉపయోగించే పనిముట్లు, సామగ్రి తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు.